7న ఉచిత వైద్య శిబిరం

కాచిగూడ: శ్రీ ప్రసన్నాంజనేయ చారిటబుల్ క్లినిక్ రెండో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం హర్రాస్ పెంటలోని ఆలయ ప్రాంగణంలో మహిళా వ్యాధులపై ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు హర్రాస్ పెంట హిందూ శ్మశాన వాటిక ప్రబంధక సమితి అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రావు తెలిపారు. శుక్రవారం నింబోలిఅడ్డాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆదివారం ఉదయం 9:30 గంటలకు వైద్య శిబిరాన్ని అంబేడ్కర్ కళాశాల చైర్మన్ సరోజ వివేక్, రచయిత్రి రాధికాకృష్ణ హాజరవుతారని తెలిపారు. ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులు అందజేస్తామని తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు.

7న శ్రీరామ పాదుకల పూజ

కాచిగూడ: జనవరి 22వ తేదీన అయోధ్యలో జరగబోయే రామ మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 7వ తేదీన (ఆదివారం) తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రి పక్కనున్న శివాలయంలో రామపాదుకల పూజ జరుగుతుందని బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి తెలిపారు. శుక్రవారం కాచిగూడలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా వికసిత్ భారత్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి అధికారుల అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ కేంద్ర పథకాల గూర్చి నేతలు ప్రసంగిస్తారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్, యువమోర్చా జాతీయ ఇన్‌చార్జీ సునిల్ బన్సల్, తెలంగాణ ఇన్‌చార్జీ తరుణ్ చుగ్, మహిళా మోర్చ ఇంచార్జీ నళిని, చింతల రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

7న మనోవిజ్ఞాన సదస్సు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

చిక్కడపల్లి: రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో మొట్టమొదటిసారి మనోవిజ్ఞాన సదస్సు నిర్వహించడం అభినందనీయమని ప్రొగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. అశోక్‌నగర్‌లోని మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్‌లో శుక్రవారం ఆమె మాట్లాడుతూ... ఈ నెల 7న మనోవిజ్ఞాన సదస్సు జరుగుతుందన్నారు. మనోవికాసానికి ఉపయోగపడే మనోవిజ్ఞాన సదస్సు పోస్టర్‌ను పలువురు మహిళా సైకాలజిస్టులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్వరూపరాణి, జ్యోతి రాజా, కృష్ణవేణి, మాధవి, నాగలక్ష్మీ, శోభారాణి, సుజాత పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ బిల్లుల మంజూరు అభినందనీయం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సెలూన్‌లు, లాండ్రీలు, ధోబీఘాట్‌ల ఉచిత విద్యుత్‌కు పెండింగ్ బిల్లుల నిమిత్తం రూ. 110 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమని జాతీయ ఎంబీసీ సంఘాల సమితి జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... అణగారిన వర్గాల కోసం బీసీ మంత్రి భరోసా అద్భుతంగా ఉందన్నారు. తెలంగాణలోని గత ప్రభుత్వం రజకులు, నాయీబ్రాహ్మణుల ఆర్థికాభివృద్ధి కోసం దేశంలో ఎక్కడ లేని విధంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న నెలకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని కొనసాగిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పడం ఎంతో ఆనందింపదగ్గ విషయమన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి: తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి అమలు చేస్తున్న పథకాలలో భాగంగా కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు అందజేయనున్నట్లు సహాయ కార్మిక శాఖ అధికారులు జి.బి.ఎస్.స్వామి, ఎ.సత్యనారాయణరెడ్డి, ఎస్.వెంకటరమణ తెలిపారు. ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని కార్మిక శాఖ కార్యాలయంలో వారు మాట్లాడుతూ... 2022-2023 విద్యా సంవత్సరంలో ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనాలు అందిస్తామని తెలిపారు. కార్మికశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని చెప్పారు. ఫిబ్రవరి 15 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. 10 వ తరగతి, ఐటీఐలో ఉత్తీర్ణులైన వారికి రూ. 1,000, పాలిటెక్నిక్ రూ. 1,500, ఇంజినీరింగ్, మెడిసిన్, లా, బీఎస్సీ, బీసీఏ, ఎంసీఏ, బీ ఫార్మసీ తదితర కోర్సులు పూర్తి చేసిన వారికి రూ. 2,000 అందిస్తామని ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు సూచించారు.

ప్రదీప్‌కుమార్ రంగస్థల సేవలు భేష్

చిక్కడపల్లి: ఆరున్నర దశాబ్దాలుగా రంగస్థల నటుడుగా దర్శకుడిగా విశేష సేవలు అందిస్తున్న ప్రదీప్ కుమార్ నాటక రంగ పరిరక్షణలో తెలంగాణలో అగ్రశ్రేణిలో నిలిచారని పలువురు వక్తలు కొనియాడారు. శుక్రవారం రాత్రి శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై ఉస్మానియా యూనివర్సిటీ తులసి భవన్‌లోని సాంస్కృతిక పరిశోధనా కేంద్రం అర్ధ శతాబ్ది వేడుకలు జరిగాయి. ప్రభుత్వ సిటీ కళాశాల ప్రిన్సిపాల్ బాల భాస్కర్, రంగస్థల ప్రముఖులు డాక్టర్ కొట్టి వెంకటాచారి, ప్రొఫెసర్ సక్కు భవ్య, భవానీ అశోక్, సుతారపు వెంకటనారాయణ, జంగయ్యగౌడ్ తదితరులు పాల్గొని ప్రదీప్ కుమార్ సాంస్కృతిక సహకారంతో పలు కార్యక్రమాలు విశేషమని ఎనభై పైబడిన వయస్సులోనూ నిర్విరామంగా నటిస్తూ యువతకు నటనలో శిక్షణ ఇస్తున్నారని వివరించారు. హనుమంతరావు స్వాగతం పలుకగా డాక్టర్ వందన కార్యక్రమ నిర్వహణ చేశారు. ఈ సందర్భంగా సిద్ధేంద్రకళా క్షేత్ర డాక్టర్ సుధాకర్, డాక్టర్ రత్న శ్రీ శిష్య బృందం కూచిపూడి నాట్యం ఆకట్టుకుంది.

సమస్యలకు శాశ్వత ప్రాతిపదికన పరిష్కారం

ముషీరాబాద్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటికి శాశ్వత ప్రాతిపదికన పరిష్కారాలు చూపుతున్నామని రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ రవిచారి వెల్లడించారు. దయారా మార్కెట్ వద్ద డ్రైనేజీ సమస్య ఉత్పన్నం కావడంతో స్థానికులు ఆయన దృష్టికి సమస్యను తీసుకువచ్చారు. ఆయన డీజీఎం మోహన్‌రావుకు సమస్యను వివరించి సత్వరమే పరిష్కరించాలని కోరారు. అప్పటికప్పుడే ఎయిర్‌టెక్ మెషిన్ రప్పించి పేరుకుపోయిన డ్రైనేజీ సమస్యను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రవిచారి మాట్లాడుతూ... నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని శాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నామన్నారు.



డ్రైనేజీ సమస్యను పరిష్కార పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవిచారి

సనాతన ధర్మాన్ని సంరక్షించే రామమందిరం

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్



ఊరేగింపులో పాల్గొన్న డాక్టర్ లక్ష్మణ్, కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణం ప్రపంచవ్యాప్తంగా సనాతన ధర్మాన్ని సంరక్షించేదిగా ఉందని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. అయోధ్య శ్రీ రామమందిరంలో ప్రాణప్రతిష్ఠ పూజిత అక్షింతలు ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపు శుక్రవారం గాంధీనగర్ డివిజన్ వివేక్‌నగర్‌లోని శ్రీ ఆంజనేయస్వామి దాలయం నుంచి మొదలైంది. డాక్టర్ కె.లక్ష్మణ్, స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అక్షింతల ఊరేగింపులో పాల్గొని అశోక్‌నగర్‌లోని ప్రతి ఇంటింకీ శ్రీరాముని అక్షింతలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 500 ఏళ్ల తర్వాత అయోధ్యలో రాములోరి విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేస్తుండటం శుభపరిణామని అన్నారు. 22వ తేదీన ప్రతి ఇంటి ముందు ఐదు దీపాలను వెలిగించాలన్నారు. అక్షంతల కలశాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో రామమందిర నిర్మాణ నగర సంయోజకులు కార్యకర్తలతోబీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పూసరాజు, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రత్నసాయిచంద్, నేతలు ఉమేష్, సురేందర్, సత్తిరెడ్డి, సురేష్, ప్రకాష్‌యాదవ్, లక్ష్మణ్ యాదవ్, శ్రీకాంత్, శివకుమారం, సంతోష్, యాదగిరి, తులసి, రామారావు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్‌కు అయోధ్య అక్షింతలు

ముషీరాబాద్: అయోధ్యలో నిర్మించిన రామమందిరం ఈ నెల 22వ తేదీన ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ ఆలయం నుంచి రాంనగర్‌లోని రామాలయానికి అక్షింతలను, ఆ దేవాలయ ఫొటోలను, కరపత్రాలను తీసుకొచ్చారు. రామాలయ భక్తులు నలుగురు ఒక బృందంగా ఏర్పడి ఇంటింటికీ పంపిణీ చేయాలని నిర్ణయించామని రామాలయ కమిటీ చైర్మన్ రవికుమార్ తెలిపారు.



జనవరి 22.. దేశ చరిత్రలో కీలక ఘట్టం: బీజేపీ



మాట్లాడుతున్న డాక్టర్ గౌతంరావు

కాచిగూడ: దేశ చరిత్రలో జనవరి 22వ తేదీ ఒక కీలక ఘట్టంగా నిలవబోతోందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. శుక్రవారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 22న అయోధ్య రామమందిరం ప్రారంభం, 26న భరతమాతకు హారతి కార్యక్రమాలను విజయవంతం చేయాలని గౌతమ్‌రావు పిలుపునిచ్చారు. నేతలు రాజశేఖర్ రెడ్డి, శ్యామ్ సుందర్ గౌడ్, పూసరాజు, మహిపాల్‌రెడ్డి, మేకల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచాలి



మంత్రి సీతక్కను కలిసిన దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లు పెంచాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం శుక్రవారం తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్లను 23 శాతం నుంచి 42 శాతంకు పెంచాలని ఆయన కోరారు. ప్రస్తుతం గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు జడ్పిటీసీలలో బీసీ రిజర్వేషన్లు కేవలం 23 శాతం మ్రామే ఉన్నాయని, దీంతో బీసీలకు రాజకీయ అవకాశాలు దక్కడం లేదని అన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా బీసీ కమీషన్ ఆధారంగా రిజర్వేషన్లు పెంచాలని కోరారు. బీసీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి హామీ ఇచ్చారని దుండ్ర కుమారస్వామి తెలిపారు. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలంటే స్థానిక పాలనలో వారి ప్రాతినిధ్యం పెంచడం తప్ప మరో మార్గం లేదని ఆయన పేర్కొన్నారు.

ఆరు గ్యారంటీలపై అవగాహన



వీరన్నగుట్టలో అవగాహన కల్పిస్తున్న కాంగ్రెస్ నేత దిడ్డి రాంబాబు

కాచిగూడ: ఆరు గ్యారంటీల అమలు కోసం చేపట్టిన ప్రజాపాలనలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతున్నది. బర్కత్‌పుర, కాచిగూడ, వీరన్నగుట్ట, మోతీలాల్ కాంగ్రెస్ పార్టీ నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం జరిగిన ప్రజా పాలనలో సీనియర్ నేత, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. ప్రజల వద్దకే పాలన వచ్చిందనన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



బాగ్‌లింగంపల్లిలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాత వాకర్స్ క్లబ్ నల్లకుంట ఆధ్వర్యంలో క్లబ్ సమన్వయకర్త పి.మెహర్‌కుమార్, అధ్యక్షుడు డాక్టర్ మురళీధరుడు, ఇతర క్లబ్ ప్రతినిధుల సహకారంతో పేదలు, అనాథలకు దుప్పట్లను పంపిణీ చేశారు. రెండవ విడతలో భాగంగా శుక్రవారం అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల పరిధిలోని బాగ్‌లింగంపల్లి, విద్యానగర్, కాచిగూడ, నారాయణగూడ, చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్ రోడ్ తదితర ప్రాంతాలలో సుమారు 500 మందికి దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అనాథలు, అభాగ్యులు రోడ్లమీద పడుకొని చలికి వణికిపోతున్నారని వారిని ఆదుకోవాలనే ఈ బృహత్కర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ఎన్నికై న లింగ ప్రకాష్, ముఖ్య సలహాదారు ఎ.రామలింగేశ్వర్ రావు, క్లబ్ ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, కోశాధికారి జైహింద్, నేతలు మారం సురేష్, లోకేష్, వినోద్‌కుమార్, కేశవరావు, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాంచ్ మేనేజర్‌గా పూర్ణిమ సేవలు అభినందనీయం



పదవీ విరమణ పొందిన పూర్ణిమను సత్కరిస్తున్న దృశ్యం

ముషీరాబాద్: ఖాతాదారులకు మెరుగైన సేవలను అందిస్తు, బ్యాంకు లక్ష్యాలను సాధించడంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రాంనగర్ బ్రాంచి మేనేజర్ పూర్ణిమ చేసిన కృషి అమోఘం అని తెలంగాణ గ్రామీణ బ్యాంకు హైదరాబాద్ రీజనల్ మేనేజర్లు యూసుఫ్, బాలనాగు అన్నారు. ప్రస్తుతం వివిధ బ్యాంకుల మధ్య విపరీతమైన పోటీ ఉన్న తరుణంలో ఖాతాదారులను కాపాడుకోవడం అంటే అంత సులువైన విషయం కాదన్నారు. బ్రాంచి మేనేజర్‌గా పూర్ణిమ బాధ్యతలు నిర్వహించిన అన్ని బ్రాంచీల్లో ఖాతాదారుల సంఖ్య గణనీయంగా పెరిగిందని వాఖ్యానించారు. రాంనగర్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి పలువురు ఖాతాదారులు, బ్యాంకు రిజనల్ మేనేజర్లు యూసుఫ్, బాలనాగులు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పూర్ణిమకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. బ్యాంక్ యూనియన్ నాయకుడు రాజ్‌కుమార్, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ రాంచందర్‌తో పాటు మహేశ్వర్, నాగధర్, చల్లా వినోద తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న సంప్రదాయ పాత్రల ప్రదర్శన



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని ఎమ్మెల్యేకాలనీ రోడ్డులో ఉన్న క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ (సీసీటీ) హాల్‌లో సంప్రదాయ పాత్రల ప్రదర్శన శుక్రవారం ప్రారంభమైంది. జిష్టా బ్రాండ్ ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన ఈ నెల 5 నుంచి 7 వరకు మూడు రోజుల పాటు కొనసాగనుంది. కంచు, ఇత్తడి, రాగితో తయారుచేసిన పాత్రలు ఇక్కడ కొలువుదీరాయి. అమ్మమ్మలు, నాన్నమ్మల కాలంలో ఎలాంటి పాత్రల్లో వంటలు వండేవారో అలాంటి సంప్రదాయ పాత్రలను ఇక్కడ ప్రదర్శిస్తుండడంతో మహిళలు పెద్ద సంఖ్యలో వాటిని కొనుగోలు చేస్తున్నారు. దేశంలోని 15 రాష్ట్రాలకు చెందిన 620 మంది కళాకారుల చేతుల్లో రూపుదిద్దుకున్న ఈ సంప్రదాయ పాత్రలు గ్రామీణ వాతావరణాన్ని తలపిస్తున్నాయి.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను సహించం

చిక్కడపల్లి: చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వీరేశం తెలిపారు. శుక్రవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ... స్టేషన్ పరిధిలోకి వచ్చే అన్ని ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వాహనాలు షోకేస్‌లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఎలాంటి నిర్మాణాలు కూడా ఫుట్‌పాత్‌లపై చేయరాదన్నారు.

ఉద్యమకారులకు రూ. 25 వేల పింఛన్ ఇవ్వాలి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు రూ. 25 వేల పింఛన్ ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల సమితి చైర్మన్ ఎస్.యాదగిరి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇస్తామని ప్రకటించడం హర్షణీయమని అన్నారు. తెలంగాణ ఉద్యమకారులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని, ఉద్యమకారుల సమస్యలను పెడచెవిన పెట్టారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మక్సూద్ సమాచారం మేరకు... ఉప్పుగూడ-యాకుత్‌పురా రైల్వే స్టేషన్ల మధ్య శుక్రవారం రైలు పట్టాలను దాటుతున్న ఓ గుర్తుతెలియని వ్యక్తి(50) రైలు ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మరణించాడు. మృతుడి ఒంటిపై బూడిద రంగు టీ షర్టు, నలుపు రంగు జీన్స్ ప్యాంట్ ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సందడిగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

హిమాయత్‌నగర్: సంస్కృతి సంప్రదాయాలు మన ఆచారాలకు పెద్దపీట వేసే ప్రయత్నంలో భాగంగా నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ కాలేజీలో శుక్రవారం నాడు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి సంప్రదాయాన్ని, స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని కేశవ్ మెమోరియల్ విద్యా సంస్థలు యూత్ ఫెస్టివల్‌ను నిర్వహించాయి. ఇందులో భాగంగా వక్తృత్వ, క్విజ్, వ్యాస రచన వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత ఎ.వి. సుబ్రహ్మణ్యం, కోశాధికారి ప్రభాకర్ రెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీధర్, డైరెక్టర్ నాగేశ్వర్ రావు, ప్రిన్సిపాల్ శాంతి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం 40 మంది విద్యార్థులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

7 నుంచి ఉద్యమకారుల కృతజ్ఞతా సభలు

హిమాయత్‌నగర్: ఉద్యమకారుల ఆవేదనను అర్థం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలోని 6 గ్యారంటీలలో ఉద్యమకారులకు 250 గజాల స్థలం, పెన్షన్‌ను చేర్చినందుకు ఈ నెల 7 నుంచి కృతజ్ఞతా సభలను నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఉద్యమకారుల కతజ్ఞత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమకారుల ఆత్మ గౌరవం, సంక్షేమం కోసం కషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారుల పక్షాన ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం కోసం కమిటీ వేయాలని, ప్రతి ఉద్యమకారుడికి గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యమకారులను తెలంగాణ స్వరాష్ట్ర సాధకులుగా గుర్తించాలని, ఉద్యమకారుల సంక్షేమ బోర్డుని ఏర్పాటు చేసి రూ. 10 వేల కోట్లు బడ్జెట్ కేటాయించాలని, పెన్షన్, ఉచిత బస్, ట్రైన్ పాస్, ఆరోగ్య కార్డు, రూ. 20 లక్షల జీవిత బీమా ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మోదీ విధానాలు ప్రమాదకరం: ఐఎఫ్‌టీయూ



మాట్లాడుతున్న సూర్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రధాని నరేంద్ర మోదీ తీసుకొస్తున్న పాసిస్టు విధానాలు అత్యంత ప్రమాదకరమని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం విమర్శించారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేంద్ర, రాష్ట్ర కార్మిక ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో గెట్ టు గెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యం మాట్లాడుతూ... ఒక వాదాన్ని ముందుకు తీసుకుపోతూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. మతం మత్తులాంటిదని ఇది దేశానికి అత్యంత ప్రమాదకరమని విమర్శించారు. ఐఎఫ్‌టీయూ నాయకురాలు అనురాధ మాట్లాడుతూ... పాలకులు ఎవరైనా వారి ఎజెండా ఒక్కటేనని కొత్త సీసాలో పాత సారా అనే విధంగా వారి వ్యవహారాలు ఉంటాయన్నారు. జనవరి, ఫిబ్రవరిలలో పని ప్రదేశాలు, నివాసాల ప్రాంతాల్లో ఇంటింటికీ కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహిస్తామన్నారు. సీఐటీయూ అధ్యక్షుడు చుక్క రాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర నాయకులు జె.వెంకటేష్, వివిధ సంఘాల నాయకులు ఎల్.ఎల్.పద్మ, శ్రీనివాస్, జనార్ధన్, విజయ్‌కుమార్‌యాదవ్, ఉమానాగమణి, అరుణ, భరత్, వి.నాగేశ్వర్‌రావు, ఎస్.వెంకటేశ్వర్ రెడ్డి, ఎం.వి.హరీష్‌బాబు, చంద్రయ్య, ఇ.కె.ఈశ్వర్ రావు, మధు, వంగూరి రాములు, పి.సుధాకర్, ఎస్.రమా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో మాదిగలకు మూడు స్థానాలు కేటాయించాలి

ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ



మాట్లాడుతున్న శ్రీనివాస్ మాదిగ

ముషీరాబాద్: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు రెండు ఎస్సీ రిజర్వేషన్ ఎంపీ స్థానాలతో పాటు ఒక జనరల్ ఎంపీ స్థానాన్ని మాదిగలకు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో మాదిగల జనాభా ఎక్కువగా ఉందని వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని మాట్లాడారన్నారు. మాదిగల పట్ల రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే మూడు ఎంపీ స్థానాలు మాదిగలకు కేటాయించాలన్నారు. ఇందులో రెండు స్థానాలు మాదిగలకు ఇవ్వాలని అలాగే గతంలో సర్వే సత్యనారాయణ గెలిచిన మల్కాజిగిరి జనరల్ స్థానాన్ని మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిలు వారి పార్టీల తరపున కూడా మూడు ఎంపీ స్థానాలు మాదిగలకు కేటాయించాలన్నారు. ఈ నెల 8వ తేదీన హైదరాబాద్‌లో మాదిగల రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యచరణతో పాటు రానున్న పార్లమెంటు ఎన్నికల అనుసరించవలసిన వ్యూహాలు చేస్తామన్నారు. కోర్ కమిటీ సభ్యులు బల్గర్ హుస్సేన్, చిలకమరి గణేష్, డాక్టర్ మల్లేష్, చాప కృష్ణ, మోహన్‌రావు, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి వెంకటేస్, ఇల్లందుల రాజేష్ కన్నా, సారంగపాణి, మరపాక నరేందర్, జిల్లా వెంకట్, బోయ ప్రవీణ్, వెంకగాల్ల వెంకట్, నక్క రమేష్, రాములు, వెంకన్న పాల్గొన్నారు.

అపజయంతో కుంగిపోవద్దు: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

వెంగళరావునగర్: చదువుతో పాటు, ఏ విషయంలోనైనా అపజయానికి లోనైతే కృంగిపోకుండా మళ్లీ ప్రయత్నిస్తే తప్పకుండా విజయం వరిస్తుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం మధురానగర్‌లోని మహిళా శిశుసంక్షేమశాఖ సమావేశ మందిరంలో స్టేట్‌హోంలో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకవైపు పుస్తకాలు విజ్ఞానాన్ని అందిస్తే మరో వైపు విజ్ఞానయాత్రలు, తోటి విద్యార్థులతో చర్చించడం ద్వారా విద్యార్థులు అనేక విషయాలు నేర్చుకుంటారన్నారు. విజ్ఞాన యాత్రల్లో ప్రత్యక్షంగా ఎన్నో విషయాలను తెలుసుకుంటామని, అవి జీవితంలో ఎన్నటికీ మరచిపోమన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలు కూడా చిన్న పాఠశాలల్లోనే చదివి ఉంటారని, అయితే వారు ఇష్టంగా చదివి ఈ స్థాయికి ఎదిగారని తెలిపారు. ఏ విషయంలోనైనా మీకు మీరు అడ్డంకులను సృష్టించుకుంటే జీవితంలో ఎదగలేరని, మళ్లీ మళ్లీ ప్రయత్నిస్తూ దానిని సాధించాలనే తపన, పట్టుదల ఉంటే 100 శాతం సాధించగలరన్నారు. స్టేట్‌హోంలో ఆశ్రయం పొందుతున్న వారంతా జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. స్టేట్‌హోం అనాథ ఆశ్రయంలోని విద్యార్థులు మూడురోజుల పాటు ఇస్రో, చెన్నై తదితర ప్రాంతాల్లో విజ్ఞాన యాత్రకు వెళ్లి గురువారం రాత్రి తిరిగి వచ్చారు. యాత్ర విజయవంతం చేసినందుకు జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావును, ఇతర సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలు వెంటనే పూర్తి చేయాలని కార్పొరేటర్ మహాలక్ష్మీరామన్ గౌడ్ కోరారు. నారాయణగూడలోని వాటర్ వర్క్స్ కార్యలయంలో జీఎం రామకష్ణని కలిసి డివిజన్‌లోని నీటి సరఫరాకు సంబంధించిన పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేయాలని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించారు. పలు బస్తీలలో మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. స్పందించిన ఆమె అధికారులు వెంటనే ఆయా బస్తీలకు నీటి సరఫరా చేయాలని సూచించారు. స్ట్రీట్ నంబర్ 9లోని రోడ్డు పనులు పూర్తిచేయనందునే పైప్‌లైన్ పనులు నిలిచిపోయాయని, సంబంధిత అధికారులు వెంటనే ఆయా పనులను పూర్తి చేయాలని కూడా కార్పొరేటర్ సూచించారు.

'ప్రజాపాలన' గడువును పొడిగించాలి: ఏఐఎఫ్‌బీ

లిబర్టీ: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా పాలన కార్యక్రమ గడువును పొడిగించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాములుయాదవ్ డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నేతలు శివలింగం, పి.మల్లేష్‌యాదవ్, దారుల రాజు, స్వామి, సిద్ధు, భీము, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.